



వీసీలో పాల్గొన్న అధికారులు

పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్‌లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ.. జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామపంచాయతీలకు సంబంధించిన మొదటి విడత నామినేషన్‌లు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మొత్తం 1408 పోలింగ్ కేంద్రాలు గుర్తించామని తెలిపారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా జరిగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ సామాగ్రి ఇప్పటికే సంబంధిత మండల కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, డీపీవో రమేష్, ఆర్డీవో స్రవంతి, డీఎల్‌పీవో ఫణిందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆరోగ్య శిబిరం

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విద్యార్థులలో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందించడానికి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హానా, డాక్టర్ దినేష్, ఆరోగ్య సిబ్బంది, కళాశాల నర్సింగ్ ఆఫీసర్ సంకీర్త్ పాల్గొన్నారు.



భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కొమురంభీం స్ఫూర్తితో పిల్లల్ని చదివించాలి


ఉట్నూర్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కొమురంభీం స్ఫూర్తితో గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని గోండుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాగోబాగూడాలో భీం విగ్రహాన్ని జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ సర్పంచ్ ఆత్రంరాహుల్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తనవద్దకు వచ్చి నేరుగా సమస్యలు తెలిపి పరిష్కరించుకుంటున్నారని అన్నారు. గతంలో ఉన్న పాలకులు అందుబాటులో లేక, వచ్చిన వారిని కలవలేక గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకునేవి కావని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బానోత్ జయవంతరావు, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీరెడ్డి, లింగంపల్లి చంద్రయ్య, దాసండ్ల ప్రభాకర్, ఆత్రం తిరుపతి, అన్వర్, అరికెల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ వసతి గృహంలో వంటగదిని పరిశీలిస్తున్న ఏటీడీవో

వసతి గృహంలో విచారణ

బోథ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో అన్నంలో పురుగులు వస్తున్నాయని ఫిర్యాదుల మేరకు బుధవారం ఐటీడీఏ ఏటీడీవో సుచరితన్‌రెడ్డి విచారణ చేపట్టాడు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. హాస్టల్లో స్టోర్ రూంతో పాటు కిచెన్ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో బియ్యం ఏవిధంగా ఉంది? భోజనంలో పురుగు ఎందుకు వచ్చాయంటూ? సిబ్బందిని అడిగారు. ఏటీడీవో మాట్లాడుతూ విద్యార్థులను విచారించి.. వారు చెప్పిన సమస్యలను అధికారులకు విన్నవిస్తామన్నారు. ఆ తర్వాత హాస్టల్లో జరుగుతున్న పరిణామాలను వార్డెన్ నామ్‌దేవుని అడిగి తెలుసుకున్నారు.




పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ఎన్నికలకు ముందే పలు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం వైపు అడుగులు వేస్తున్నాయి. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నుంచి మొదటి విడత నామినేషన్లు స్వీకరించనున్నారు. దీంతో పల్లె రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి.

ఏకగ్రీవం వైపు.. అడుగులు

రంగంలోకి దిగుతున్న గ్రామ వీడీసీలు, నేతలు

- జిల్లాలో రిజర్వేషన్ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి
- ఏకాభిప్రాయం కోసం జోరుగా మంతనాలు
- ఎన్నికలకు ముందే ఏకమవుతున్న పలు గ్రామాలు
- నేటి నుంచి మొదటి విడత నామినేషన్లు షురూ..
- జిల్లావ్యాప్తంగా 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డులు





ఆదిలాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఎలాగైనా గెలిచేందుకు ఆశావాహులు వివిధ రకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. గెలిచే అవకాశం లేని చోట ఏకగ్రీవ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. గ్రామ అభివృద్ధి పేరిటా వీడీసీ లు ఏకగ్రీవం దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. గత ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 162 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈసారి కూడా మెజార్టీ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేసేందుకు గ్రామపెద్దలు మంతనాలు జరుపుతున్నారు. 251 గ్రామ పంచాయతీలు ఏజెన్సీ పంచా యతీలే కావడంతో ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజాసమస్యలు, సమాజం పట్ల అవగాహన కలిగిన అభ్యర్థులను గ్రామ సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తే ఆర్థికంగా నష్టపోవడంతో పాటుగ్రామాల్లో మనస్పర్థలు, వర్గ విబేధాలు, కక్షలు, గొడవలు, ఘర్షణలు, వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

గ్రామ అభివృద్ధి పేరిట..

గ్రామ అభివృద్ధి పేరిట పలు పంచాయతీలు ఏకగ్రీవ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. ప్రభుత్వం అందించే నజరానాతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు వేల జనాభాకు పైగా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు, ఆలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. అయితే గతంలో ఏకగ్రీవమైన పంచాయతీలకు ఇప్పటి వరకు నజరానా అందించక పోవడంతో పలు గ్రామాల ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నా రు. అయితే పోటీ అధికంగా ఉన్న చోట టెండర్, లాటరీ పద్ధతిల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపికకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గ్రామ వీడీసీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేస్తే ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో

- మిగతా 6లో

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య స్వామి జన్మదినోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలను జిల్లాలో అంగరంగ వైభవంగా జరపగా.. ఆయా ఆలయాల ప్రాంగణాలు హరిహర సుతుడి నామ స్మరణతో మార్మోగాయి. మండల కాలంలో కఠిన నియమాలతో కూడిన అయ్యప్ప దీక్షలు స్వీకరించిన భక్తులు... భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపడుతూ భక్తి భావాన్ని చాటారు. అందులో భాగంగానే ప్రసిద్ధ బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలను బుధవారం కన్నుల పండువగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేశారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో స్వామి భక్తులు కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకొని.. పూజలు జరిపారు. వేద పండితుల సమక్షంలో పూజాది క్రతువులు పూర్తి చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని రవీంద్ర నగర్‌లోని హరిహర అయ్యప్ప ధర్మక్షేత్రం ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలను వైభవోపేతంగా జరిపారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తుల కోలాహలం నెలకొనగా.. దామోదర్ గురుస్వామి నేతృత్వంలో పూజాది క్రతువులను నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రత్యేక పూజలను జరిపారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు అయ్యప్ప నామ స్మరణ చేస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బెల్లూరి ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



యాపలగూడలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడ గ్రామంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని కొండపైగల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, నూతన వస్త్రాలంకరణ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ యాపల్ గూడ పురవీధుల గుండా స్వామి వారి నామస్మరణతో భాజాభజంత్రీలతో సుబ్రహ్మణ్య స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అర్చకుడు సజ్జనపు వెంకటి మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్,జైరామ్ సంతోష్, కాంతారావు, రోషన్, లక్ష్మారెడ్డి, కిష్టయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాంసి: సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భంగా మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలో ఉన్న హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ముందుగా అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



ఇచ్చోడలో విద్యార్థులతో మాట్లాడుతూ..

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు

- రౌడీషీటర్లకు ఎస్పీ హెచ్చరిక

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్‌లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, తిరిగి నేరాలు చేయాలనే ఆలోచన వస్తే జైలు తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా రౌడీ షీటర్ల, సస్పెక్ట్ షీటర్లను ఎస్పీ పరిశీలించారు. ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పట్టణంలోని మహాలక్ష్మీవాడ, ఎస్సీ కాలనీ, శాంతినగర్‌లలో ఉన్న రౌడీషీటర్‌లు, సస్పెక్ట్ షీటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్ధరాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లను, పుర వీధులను సందర్శించారు. రౌడీలను, సస్పెక్ట్‌లను పరిశీలించి వారి నేరచరిత్ర ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఎస్పీ ఆరా తీశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్ కుమార్, కె నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి ఎదగాలి : ఎస్పీ

ఇచ్చోడ: విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అడుగులు వేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యాలయ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం చాలా బలమైనదని ఇక్కడ నివసిస్తున్న ప్రతీ ఒక్కరికి సమాన హక్కులు లభిస్తాయని, విద్యార్థులు పూర్తి అవగాహన పెంచుకొని ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు ఏకాగ్రతను కలిగి ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థినులు పాఠశాలకు వచ్చే దారిలో ఆకతాయిలు వెంటపడితే షీటీంకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థినులకు, మహిళలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తిన షీటీంను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మార శ్యాంరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమోద్, సీఐ రాజు, పాఠశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.అభయ్

అంకోలి ఆస్పత్రికి కేంద్ర పరిశీలకుడు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ఆస్పత్రిని బుధవారం కేంద్ర పరిశీలకుడు, బెంగుళూర్ ఆస్పత్రి వైద్యుడు కె.అభయ్(నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్) సందర్శించారు. దీనిలో భాగంగా వాతావరణంలో వచ్చే మార్పులు, ఏ కాలంలో ఏ వ్యాధులు వస్తున్నాయో? స్థానిక డాక్టర్ సర్ఫరాజ్‌ను అడిగితెలుసుకున్నారు. పీహెచ్‌సీ ఆవరణలో స్టోర్ రూమ్, ల్యాబ్, బయోమెడికల్ వెస్టేజ్ డిస్పోజల్ మేనేజ్‌మెంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ శ్రీధర్ మిట్టపల్లివార్, హెల్త్ సూపర్‌వైజార్స్ బి.సుభాష్, ఎన్‌సీడీ ఆఫీసు సుపర్‌వైజార్ కె.శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు రాజ్యలక్ష్మి, ప్రతిమ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి
- అధికారులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ
- జిల్లాలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెన్ గంగా భవన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మార్గదర్శకమని అన్నారు. ప్రతీ పౌరుడు రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు, కర్తవ్యాలు తెలుసుకుని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఉద్యోగి పారదర్శకత, నిబద్ధత, నైపుణ్యం వంటి రాజ్యాంగ విలువలను పాటిస్తేనే మంచి పాలన సాధ్యమవుతుందని అన్నారు. దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా నిలుపుదలకు ప్రతీ పౌరుడు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలో బుధవారం ఘనంగా జరిపారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. పలు సంఘాల ప్రతినిధులు, అంబేద్కర్ వాదులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం సంవిదాన్ దివస్ ర్యాలీని అంబేద్కర్ చౌక్ నుంచి ప్రారంభించి ర్యాలీ కైలాష్ నగర్‌లోని బుద్ధ విహార్ వరకు కొనసాగింది.

ఆదిలాబాద్ అర్బన్: గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో సంవిధాన దివాస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. శివకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని

(తరువాయి 6వ పేజీలో.....)



పెన్‌గంగా భవన్‌లో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఉట్నూర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా మాధ్యమిక అధికారి, అధ్యాపకులు

హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలి : జిల్లా అధికారి

నార్నూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అకాడమిక్ విజిట్ పెంచేందుకు విద్యార్థులను కేటగిరి వైజ్ విభజించి ప్రత్యేకమైన తరగతుల నిర్వహించి వారి హాజరు శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అధ్యాపకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పోషకులకు అవగాహన కల్పించడం, వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం గురించి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో ప్రతీఒక్కరు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక ఆఫీస్ సుపరిండెంట్ షేక్ మోసిన్, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.


నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న నేతలు

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేస్తూ కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, టీపీజీఎస్ ఆధ్వర్యంలో మావల మండల కేంద్రంలో దగ్ధం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేసిందని, కరోనా కష్టకాలంలో దొంగ దారిన పార్లమెంటులో ఆమోదించుకుందని పాలడుగు భాస్కర్ ఈ సందర్భంగా ఆరోపించారు. అంతేకాకుండా సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును, కనీస వేతనాలు అడిగే హక్కును, ఉద్యోగ భద్రతను కార్మిక వర్గానికి దూరం చేసిందన్నారు. లేబర్ కోడ్ లు అమలులోకి రాకుండా భారత కార్మిక వర్గం ఐక్యంగా గత ఐదు సంవత్సరాలుగా దేశవ్యాప్త సమరశీల పోరాటాలను నిర్వహిస్తూ వస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనిపక్షంలో కార్మిక వర్గం దేశవ్యాప్త ఐక్యపోరాటాలకు సన్నద్ధం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి ఏఆర్ సింధు, రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్‌వీ రమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ.జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, లంక రాఘవులు, పూసం సచిన్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను పరిరక్షించేందుకు అవిశ్రాంత పోరాటాలు..

- నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జాతీయ నేతల డిమాండ్
- రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండవ రోజు నిర్వహించిన ప్రతినిధుల సభ నిర్వహణ...


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటిటీ ఇవ్వాలని, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం వారిని కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా మవలలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత జెండా ఆవిష్కరణ చేసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ లు అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఈ మధ్యకాలంలో మరణించిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సభ ప్రారంభించారు. ఐసీడీఎస్ పరిరక్షణ, అంగన్‌వాడీ హక్కుల సాధన, సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యలపై మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేశారు.

బీసీలకు కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసింది

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి
- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని చేపి మోసం చేసిందని స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలను కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసిందని, 42 రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపి కొన్ని మండలాల్లో ఒక్క సీటు కూడా బీసీ క్యాటగిరీ వారికి కల్పించలేదని మండిపడ్డారు. గతంలో ఉన్న 22 పాత రిజర్వేషన్లు కూడా తీసేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిసిల పట్ల ప్రేమ లేదని కేవలం రాజకీయ పబ్బం గడపడానికే బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికారని అన్నారు. అంతేకాకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికి చేశారన్నారు. మహిళలకు నెలకు రూ.2 వేలు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదరేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, అధికార ప్రతినిధి కిరణ్, మండల ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్, తదితరులున్నారు.

కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక

● ఇచ్చోడ, సిరికొండ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల ఏకాభిప్రాయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ఇచ్చోడ. సిరికొండ మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అలాగే, నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉప్పు పోశట్టి మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి గ్రామానికి చేరుకుని, ఉప్పు పోశెట్టి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

(5వ పేజీ తరువాయి...)

ఆమోదించిన రోజును స్మరించుకోవడం, అందులోని విలువలను విద్యార్థులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాజ్యాంగంలోని న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధునిక భారత నిర్మాణంలో ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యత పై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ముందుగా డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.


పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగుతున్న సంవిదాన్ దివస్ ర్యాలీ

అలాగే, ఉట్నూర్ మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు వాఘ్మారే జగ్గీవన్, లింగోజితండా మాజీ సర్పంచ్‌జాదవ్ హరినాయక్‌లు బుధవారం బీఆర్ఎస్‌నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు.

అలాగే, ఉట్నూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఇందులో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్, మండల అధ్యక్షులు బింగివెంకటేష్, తదితరులున్నారు.

అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంవిధాన్ దినోత్సవం (రాజ్యాంగ దినోత్సవం) బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత బబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగం రచన గొప్పతనం రాజ్యాంగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపాల్ ధనరాజ్ వివరించారు.

బోథ్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జీడిపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్క గంగయ్య పేర్కొన్నారు. రాజ్యంగ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా హక్కులు, విధులు కల్పించడం జరిగిందని ప్రతి ఒక్కరు హక్కులతో పాటు వీధులను నిర్వహించాలన్నారు.

అలాగే, సోనాలలో బుద్ధిస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోరాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రాజ్యాంగాన్ని మార్చాలని పాలకులు ఆలోచనలు ఉన్నారని.. మార్చకుండా పరిరక్షించాలన్నారు.

నార్నూర్: ఉమ్మడి మండల కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవాన్ని దళిత, ఆదివాసులు ఘనంగా నిర్వహించారు. నార్నూర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు.

ఇంద్రవెల్లి: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ముత్నూర్‌లో ఘనంగా నిర్వహించారు.

అలాగే, దేశ పౌరులందరూ సమాన స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి భారత రాజ్యాంగమే కారణమని, అలాంటి రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం శుభపరిణామమని సమతా సైనిక్ దళ్ జాతీయ అధ్యక్షుడు మార్షల్ సునీల్ సారిపుత్త, భారతీయ బౌద్దిక్ ప్రముఖ్ మార్షల్ అడ్వకేట్ ప్రకాష్ దార్శనిక్ అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో మార్చ్‌పాస్ట్ ర్యాలీని నిర్వహించారు.

తలమడుగు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ పాఠశాల కజ్జర్ల పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.. తదనంతరం ప్రధాన ఉపాధ్యాయురాలు కొమ్ము జ్యోతి మాట్లాడారు.

ఏకగ్రీవం వైపు.. అడుగులు

(5వ పేజీ తరువాయి...)

ఏ నలుగురు కలిసిన పంచాయతీ ఎన్నికల పైననే చర్చిం చుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. నజరానా మాట దేవుడెరుగు కానీ ఏకగ్రీవమైతే ఎన్నికలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్న ఆలోచనతో పలు గ్రామాలు ఉన్నట్లు తెలుస్తుంది.

పెరిగిపోతున్న ఖర్చు భారం

ప్రతిసారి పంచాయతీ ఎన్నికల్లో ఖర్చుభారం పెరిగి పోవడంతో ఎన్నికలకు వెళ్లేందుకు ఆశావహ నేతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఏకగ్రీవం వైపు రిజర్వేషన్ పంచాయతీలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ఎం దుకంటే పోటీతత్వంతో ఖర్చు భారం విపరీతంగా పెరిగి పోతోందని చెబుతున్నారు. మందు, విందులతో పాటు నగదు పంపిణీ తప్పనిసరిగా మారుతుంది. దీంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు. రిజర్వేషన్ గ్రామ పంచాయతీలపై నేతలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. జిల్లా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఎక్కువ గ్రామ పంచా యతీలు, గిరిజన తాండాలు, గూడెలే కావడంతో స్థానికంగా మంచి పలుకుబడి ఉన్న నేతలే పంచాయతీ ఎన్నికలపై చక్రం తిప్పుతున్నారు. మెజార్టీ పంచాయతీలను ఖాతాలో వేసుకునేందుకు ప్రధానపార్టీలూ ప్రయత్నాలు చేస్తున్నాయి. కుదిరితే ఏకగ్రీవం లేదంటే తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఊపందుకుంటున్న పల్లె రాజకీయం

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం ఆ వెంటనే నామినేసన్ పర్వం మొదలు కావడంతో పల్లె రాజకీయాలు మరింతగా ఊపందుకుంటున్నాయి. ఆశావహ నేతలు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. విందు రాజకీయాలతో హల్‌చల్ చేస్తున్నారు. గ్రామానికి దూరంగా ఫాంహౌజ్, పంట చేన్లు, అటవీ ప్రాం తాల్లో గ్రామస్థాయిలోని ముఖ్యనేతలకు విందులను ఏర్పాటు చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లలో మార్పులు రావడంతో కొంత మంది నేతలు పూర్తిగా సైలెంటై పోయారు. మొదట పంచాయతీ ఎన్నికలు రావడంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు తమ అనుచరులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. భవిష్యత్తులో సర్పంచ్‌ల సహకారంతో గెలిచేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రధాన పార్టీల నేతలు ముందుచూపుతో పల్లె రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు.

బాలల హక్కులపై అవగాహన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఘటనల దృష్ట్యా బాలల హక్కులను ప్రతిఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సమీర్ ఉల్ల ఖాన్ అన్నారు. 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ష్యూర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడబ్ల్యుసి కమిటీ సభ్యుడు సమీర్ ఉల్ల ఖాన్, డీసీపీవో రాజేంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సూరజ్ సింగ్ హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లెన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, ష్యూర్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు సంపత్ కిరణ్, సౌజన్య, కేస్ వర్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య పరీక్షలు

నేరడిగొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లఖంపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల వసతి గృహంలో ఆర్‌బిఎస్‌కె బృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వసతి గృహంలోని మొత్తం 98 మంది విద్యార్థినులకు సీబీపీ రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరీక్షించి, అవసరమైన వారికి తగు సూచనలు అందజేశారు. ఆర్‌బిఎస్‌కె వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఫార్మసిస్ట్ ఓం ప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్త జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

సారంగాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల జాం గ్రామ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు రాజ్యాంగ దినోత్సవంపై వివరించారు. అనంతరం విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్ జంప్, రన్నింగ్ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సంగీత కళాశాల సిబ్బంది ఉన్నారు.

భైంసా రూరల్: భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నీరజ్ మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా పేద, బడుగు వర్గాల కోసం ఎంతో స్వేచ్ఛ సౌభ్రాతృత్వం లభించిందని తెలిపారు. ఆయన చరిత్రలో ప్రతీ ఒక్కరిలోనూ ఎంతగానో ప్రేరణ కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో ప్రదీప్, కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాసర: ట్రిపుల్ ఐటీ బాసరలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమంలో భాగంగా వీసీ గోవర్ధన్ మాట్లాడారు. భారత రాజ్యంగం గురించి విద్యార్థులకు వివరించారు. అంతకుముందు బీఆర్ఎస్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక పఠనం చేశారు. కార్యక్రమంలో ఓఎస్డీ మురళీదర్శన్, ట్రిపుల్‌ఐటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాల తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆదర్శ మోడల్ పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాల యంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, రబింద్ర ఉన్నత పాఠశాల, అక్షర, సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మన దేశానిదేనన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చరిత్రను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనక మాలక్ష్మి, ఆసంవార్ సాయినాథ్, సారధి రాజు, సుభాష్, తహసీల్దార్ శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ తెలంగ్ రావు, ఆర్ఐ నారాయణ రావు పటేల్, ఎంపీడీవో లవ కుమార్, ఎంపీవో శివకుమార్, సూపరింటెండెంట్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కుంటాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు


భైంసాలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


ముథోల్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం

దీక్షా దివస్ సన్నాహక సమావేశం


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రా మంలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 29న జరిగే దీక్ష దివాస్ సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కోరిపెల్లి రామ్‌కిషన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, నియోజకవర్గానికి చెందిన నేతలు లోలం శ్యాం సుందర్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికులను కలిసిన ఉపాధ్యాయులు


సైకిల్ యాత్రికులను కలుసుకున్న ఉపాధ్యాయులు

సోన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం ప్రపంచ శాంతి కోసం కాలుష్య రహిత సమాజం కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్న మహారాష్ట్ర వాసులను జిల్లా ఉపాధ్యాయులు తోడిశెట్టి రవికాంత్, తోడిశెట్టి చంద్రయ్య, పోతుగంటి సాయన్న, మారుపాక శ్రీనివాస్, సేర్పూర్ సత్యనారాయణలు గంజాల్ టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికారు. మహారాష్ట్రలోని పూణేకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దత్త, విశ్రాంత బ్యాంకు మేనేజర్ అవినాష్ చౌహాన్‌లు నవంబరు 12వ తేదీన సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర 25 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాల్లో పనుల వేగవంతంపై అధికారులకు ఆదేశాలు

నర్సాపూర్(జి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్ (ఎంఆర్‌వో) శ్రీకాంత్ బుధవారం మండల కేంద్రంతో పాటు రాంపూర్ సబ్ సెంటర్, నసీరాబాద్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అ డిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వేగంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి, త్వరగా సొమ్ము చెల్లించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నవత జ్యోతి, ఏపీఎం గంగామణి, రైతు నడిపోళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.


నసీరాబాద్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం


ముథోల్‌లో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ముథోల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో లవ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీవోకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరొక్కసారి ముందు జాగ్రత్త పోలింగ్ స్టేషన్ వాటిలో ఉన్న కనీస సౌకర్యాలు, ర్యాంపు తదితర వాటిని మరొక్కసారి పరిశీలించి, అన్ని ఏర్పాట్లు ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు జరిగేంత వరకు సంబంధిత అధికారులు అందుబాటులోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వివరాలను, తదితర వాటిని అడిగి తెలుసు కున్నారు. అలాగే పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివ కుమార్, సూపరిండెంట్ అశోక్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు భైంసా మునిసిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు


అజ్మీరా సంకేత్ కుమార్

భైంసా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భైంసా మున్సిపల్ కమిషనర్‌గా ఇక్కడి సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు కేటాయించబడ్డాయి. ఈ మేరకు బుధవారం సీఎండీ డైరెక్టర్ డా.టీ.కె.శ్రీదేవి సంబంధిత ఉత్తర్వులు జారీ చేసారు. భైంసా మున్సిపల్ కమిషనర్‌గానున్న బి.రాజేష్ కుమార్ పై స్థల అక్రమ రిజిష్ట్రేషన్ వ్యవహారానికి సంబంధించి చీటింగ్ కేసు నమోదయ్యింది. దీంతో ఈ నెల 17 నుంచి కమిషనర్ బి.రాజేష్ కుమార్ సెల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాయి. ఈ కారణంగా గత పది రోజుల నుంచి మునిసిపాలిటీలో కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోయాయి. పరిస్థితిని సమీక్షించిన ఉన్నతాధికారులు భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్‌కు మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పచెబుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

బీమా చెక్కు అందజేత


బీమా చెక్కులను అందజేస్తున్న సంఘం అధ్యక్షుడు అంపోలి కృష్ణ ప్రసాద్ రెడ్డి

సోన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజులాపూర్‌లో బుధవారం శనిగారపు రవికి బీమా కేంద్రం రూ.2లక్షల చెక్కు అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు అంపోలి కృష్ణ ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనిగారపు రవి తండ్రి నారాయణ పీఏసీఎస్ మంజులాపూర్‌లో సభ్యుడు అయినందున అతను ఐదు నెలల క్రితం చనిపోవడంతో నామిని అయిన రవికి బీమా డబ్బులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇందులో ఉపాధ్యక్షులు బర్మ గంగాదాస్, డైరెక్టర్ పురాస్తు రాజేష్, మాజీ చైర్మన్ మురళీధర్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ శిరీష్ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రజతం సాధించిన తానూర్ విద్యార్థి


విద్యార్థి బాలాజీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

తానూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని సాధించినట్లుగా ప్రధానోపాధ్యాయులు సాయిబాబు తెలిపారు. 45 కిలోల అండర్ - 17 విభాగంలో విద్యార్థి సీహెచ్ బాలాజీ తన ప్రతిభను కనబరిచాడని, తన కఠిన శ్రమ, క్రమశిక్షణ, కోచ్‌ల మార్గదర్శకతతో ఈ రజత పతకాన్ని సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింతగా పెంచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని బుధవారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు





అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్

- ఆరు నెలల నుంచి అందని అద్దె డబ్బులు
- సగానికి పైగా అద్దె భవనాల్లో సెంటర్లు
- సొంత భవనాలు 35, ఫ్రీ రెంట్ 67
- అద్దె భవనాలు 74 » 17 అంగన్‌వాడీ టీచర్ల 78 ఆయా పోస్టులు ఖాళీ

ముథోల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చడంలో అధికారులువిఫలమవుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అద్దెభవనాల్లో కేంద్రాలు నిర్వహించాల్సి వస్తుండడంతో టీచర్లకు తిప్పలు తప్పడం లేదు.అంతేకాకుండా 17 అంగన్‌వాడీ టీచర్లు,78 ఆయా పోస్టులు ఖాళీ ఉన్నాయి. అంతే కాకుండా సీడీపీవో బదిలీ కావడంతో ఇన్‌చార్జి సీడీపీవో విధులు నిర్వహిస్తున్నారు.ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 180 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 37సొంత అంగన్‌వాడీ భవనాలున్నాయి. 69 భవనాలు ఫ్రీరెంట్ ఉండగా 78 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సొంత భవనాలు కరువు

ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 180 అంగన్‌వాడీ సెంటర్లకు అలాగే 180 అంగన్‌వాడీ టీచర్లు ఉండాలి. కానీ 163 అంగన్‌వాడీ టీచర్లు ఉండగా 17 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. 180 ఆయా పోస్టులు ఉండాల్సి ఉండగా, 120 ఆయా పోస్టులు ఉన్నాయి. 78 ఆయా పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీ చేసి తగు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సొంత భవనాలు లేకపోవడం వల్ల విధులను సక్రమంగానిర్వహించడంలో టీచర్లు,ఆయాలుఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆరు నెలల నుంచి అద్దెభవనాలకు సంబంధించిన అద్దె డబ్బులు రావాల్సిఉందని దీంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఆరు నెలల నుంచి ఆరు ఏళ్ల లోపు వయస్సున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం, మూడు నుంచి ఆరు ఏళ్ల బాలబాలికలను పాఠశాల వైపు ఆకర్షిస్తూ విద్యపై అవగాహన కల్పించడం, చిన్నారులకు రోగ నిరోధక టీకాలు ఇప్పించడం, ఆరోగ్య పరీక్షలు, ఇతర వైద్య సేవలు అందించడం వంటివి నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి తోడు మహిళల వివరాలు, గర్భిణులు, బాలింతల వివరాలు వారి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం వంటివి చేయాల్సి ఉంటుంది.ఆరోగ్య, పౌష్టికాహారం ప్రాధాన్యంపై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. రక్త హీనత, విటమిన్ ఏలోపం వంటి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలువివరించాల్సి ఉంటుంది. ఇలా చిన్నారులు, మహిళలు, బాలికల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఆయాకేంద్రాల కార్యకర్తలు తమ విధులను నిర్వహించాల్సి ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చాల్సిన అవసరముందని మహిళా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

– సరోజిని, సీడీపీవో, ముథోల్



సుమారు ఆరు నెలల నుంచి అద్దెభవనాలకు సంబంధించిన అద్దెడబ్బులు రావాల్సి ఉన్న మాట వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే చెల్లిస్తాం.

నూతన భవనాన్ని మంజూరు చేయండి

– రేష్మ, అంగన్‌వాడీ టీచర్, తరోడా



తరోడాలో ఉన్న సొంత అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో చేరడంతో గత నాలుగు నెలల నుంచి అద్దె భవనాలలో కొనసాగుతుంది. అద్దె డబ్బులు సైతం నాలుగు నెలల నుంచి అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అద్దె డబ్బులు రాక ఇబ్బందులు

– జి. అనీలా, అంగన్‌వాడీ టీచర్, ముథోల్



సెంటర్ నెంబర్ 12 అయితే మార్చి నెల నుంచి అద్దె అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవన యజమానులు నెల నెల అద్దె డబ్బులు చెల్లించాలని అంటున్నారు. డబ్బుల చెల్లించే బాధలు తప్పడం లేదు.ఉన్నత అధకారు స్పందించాలన్నారు.

క్రైం సమాచారం

ముగ్గురి బైండోవర్

కుంటాల,నవంబరు, 26(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా కుంటాల మండలంలో బుధవారం రోజు ముగ్గురి బైండోవర్ నిర్వహించినట్లు ఎస్సైఅశోక్, తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు.పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా ప్రతీఒక్కరు సహకరించాలని వారు పేర్కొన్నారు. ఈసందర్భంగా పాత నేరస్తులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్ టౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని భుక్తాపూర్‌లో నివాసం ఉంటున్న చౌహాన్ అంకుష్(24) కుటుంబ కలహాల కారణంగా మద్యానికి బానిసై ఇంట్లోనేఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మృతుడి తల్లి చౌహాన్ బేబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఇంటిపై దాడి.. ఏడుగురిపై కేసు

ఇచ్చోడ,నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి):ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన నస్రీన్ అనేమహిళ ఇంటిపై దౌర్జన్యం చేసిన కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు పేర్కొన్నారు. నస్రీన్ భర్త ఫిర్దోస్‌ఖాన్ అనే బాధితురాలి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇంటి వస్తువులను ధ్వంసం చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ, అశ్రద్ధగా, క్రూరంగా ప్రవర్తించిన వ్యక్తులతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దౌర్జన్యాలకు పాల్పడినవారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భార్యపై భర్త దాడి

తాంసి,నవంబరు26(ఆంధ్రజ్యోతి):తాంసిలో మద్యంమత్తులో భార్యపైదాడి చేసిన కేసులో భర్తను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఫణిందర్ పేర్కొన్నారు. సీఐ వివరాల ప్రకారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన మల్లెల నరేష్ మద్యానికి బానిసై భార్యతో గొడవ పడేవాడు. కాగా ఈనెల 23న తన భార్య లావణ్యపై ఇనుప పట్టితో దాడి చేశాడు. ఈ ఘటనపై కేసునమోదు చేసి విచారణ చేపట్టిన సీఐ బుధవారం నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.సీఐతో పాటు ఎస్సై జీవన్‌రెడ్డి ఉన్నారు.

బెల్ట్ షాప్‌లో మద్యం పట్టివేత

నిర్మల్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అనంతపేట్ గ్రామంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు రూరల్‌ఎస్సై లింబాద్రి తెలిపారు.ఈదాడుల్లో గ్రామంలోని ఓబెల్ట్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా 8.3 లీటర్ల మద్యం లభించింది. దీని విలువ సుమారు రూ.5,530 ఉంటుందని తెలిపారు. ఈసం ఘటనలో దుకాణ యజమాని నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సైతెలిపారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.



పట్టుబడిన మద్యంతో రూరల్ ఎస్సై లింబాద్రి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సోన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని కడ్తాల్ గ్రామశివారులోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గా యపడ్డారని ఎస్సై గోపితెలి పారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సాయిచరణ్(24)తన కేటీ ఎం బైక్ తీసుకొని తన మిత్రుడు కుం టాల లక్కీకుమార్‌తో కలిసి నిజామాబాద్‌కి పని నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కడ్తాల్ గ్రామ శివారులో గల హెపీ పెట్రోల్ పంపు వద్ద సాయిచరణ్ అజాగ్రత్తగా, బైక్‌ని నడిపి నడుచుకుంటూ వెళ్తున్న నిర్మల్ పట్ట ణానికి చెందిన రిజ్వాన్ అనే వ్యక్తిని ఢీకొట్టడం వలన సాయిచరణ్ తలకు గాయమై తీవ్రరక్త స్రావమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. బైక్ వెనకాల కూర్చున్న కుంటాల లక్కీ కుమార్, బైక్ ఢీకొట్టిన రిజ్వాన్ తలకి గాయాలయ్యాయి.వీరిద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఇట్టి సంఘటనపైన కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య

నర్సాపూర్(జి), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలోని గోపాల్ నగర్‌కు చెందిన 60 ఏళ్ల గాయక్వాడ్ ప్రభాకర్‌కు గత 15 రోజుల క్రితం ఆసుపత్రిలో కిడ్నీలు పాడవడంతో పాటు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. తీవ్ర అనారోగ్యం, భరించలేని బాధతో మనస్థాపానికి గురైన ప్రభాకర్ మంగళవారం సాయత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బువారం మధ్యాహ్నం సమయంలో నర్సాపూర్(జి) మండలం నసీరాబాద్ గ్రామ శివారులోని ఫారెస్ట్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని కుమారుడు గాయక్వాడ్ ప్రవీణ్ గుర్తించాడు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడి మనస్తాపంతోనే మృతి చెందాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట టోకరా

» అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితులు అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన ముగ్గురిపై కేసునమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. కేర్‌ఫౌండేషన్ సైన్స్‌ఇన్ఫాంట్ పేరుతో సరికొత్త జాబ్‌ఫ్రాడ్‌కు నిందితులు తెరలేపారని, పట్టణానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి లక్షల్లో డబ్బులు కాజేశారని పేర్కొన్నారు. పట్టణానికి చెందిన బాధితుడు మహమ్మద్ యాకూబ్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని కేర్ ఫౌండేషన్ సైన్స్ ఇన్ఫాంట్ పేరుతో గేడం మనోజ్ సంప్రదించారు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, బాధితుని వద్ద నుంచి లక్షల్లో వసూలు చేసి మరొక నిందితుడు చంద్రయ్యకు అందజేశారు. వీరిద్దరూ కలిసి వారి కమిషన్ తీసుకొని ప్రధాన నిందితురాలు సుజాతకు డబ్బులు అందించారు. గేడం మనోజ్ ఆదిలాబాద్ కు చెందిన వ్యక్తి కాగా...మిగిలిన ఇద్దరు హైదరాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. వీరి బాధితులు పది నుంచి పదిహేను మంది వరకు ఉండవచ్చని, కేర్‌ఫౌండేషన్ ద్వారా మోసపోయిన్న బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు. ఒక్కొక్కరి వద్ద లక్ష నుంచి లక్షన్నర వసూలు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు మరో నిందితురాలు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, నోటిఫి కేషన్ల ద్వారా మాత్రమే ప్రభుత్వ ఉద్యో గాలు భర్తీ అవుతాయన్న విషయాన్ని గ్రహించాలని సుచించారు.

కుంటాలలో రైతు దీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్,మార్క్‌ఫెడ్ సిబ్బంది



రైతు దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కుంటాల,నవంబరు,26(ఆంధ్రజ్యోతి):కుంటాల మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో పండించిన సోయాపంటను ప్రభుత్వం భేషరుతుగా కొనుగోలు చేపట్టాలని మండల కేంద్రం కుంటాలకు చెందిన పడకంటి దత్తు అనే రైతు బుధవారం మండల కేంద్రం కుంటాల స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రైతుల సోయాపంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని అధికారులు స్పందించి కొనుగోళ్ల వేగవంతం చేసే వరకు దీక్ష చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంట పండించేందుకు మూడు నెలలు సమయం పడితే పంటను విక్రయించేందుకు రెండు నెలల సమయం పడుతుందని గత నెల రోజుల క్రితం కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో సోయాలకు తూకం వేసి కొనుగోలు కేంద్రంలో ఉంచినప్పటికి గోదాంకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నందున ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయన దీక్షకు మండలంలోని పలు గ్రామాలరైతులతో పాటు నాయకులు విలాస్ గాదేవార్,లోలం శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు. రైతులను పట్టించుకోని ఏ ప్రభుత్వాలు కూడా ఇప్పటి వరకు ముందుకు సాగలేదని, అధికారులు రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని తూకం వేసిన సోయాలన్నింటిని గోదాంకు తరలించాలని పేర్కొన్నారు.ఈసందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ వారితో చర్చించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్ల చేపడుతున్నామని, రైతులకు ఎలాంటి నష్టం వాటిళ్లకుండా తమవంతు కృషి చేస్తామని కుంటాల మండలంలో సోయా కొనుగోళ్ల విషయంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఉన్నతాధికారుల సూచనల మేరకు రాబోయే రోజులలో రైతులకు సంబంధించిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కృషిచేస్తామన్నారు. మార్క్‌ఫెడ్ అధికారుల వివరణకు సంతృప్తి చెందని రైతుదీక్ష కొనసాగిస్తూనేఉన్నాడు. అనంతరం మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, నాఫెడ్ అధికారి కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేపట్టిన సోయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం సిబ్బంది సోయా కొనుగోలు చేసే సమయంలో నాణ్యమైన సోయాలను మాత్రమే కొనుగోలు చేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదని పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి),నవంబరు26(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై పెట్రోల్ పంపు వద్ద కూరగాయల మార్కెట్‌కు వస్తుండగా భామ్ని(బి) తండాకు చెందిన లక్షన్ బైక్ అదుపు తప్పి పడిపోవడంతో రోడ్డు పక్కన కార్మికులు గమనించి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

బాల్య వివాహం అడ్డగింత

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక కాలనీలో బాల్య వివాహాన్ని అధికారులు బుధవారం అడ్డుకున్నారు. ఆ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక మరొక కాలనీకి చెందిన 26 ఏళ్ల ఓ యువకుడితో పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నాయి. బాల్య వివాహం విషయమై చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం రాగా అధికారులు అక్కడికి చేరుకున్నారు. బాలికకు చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, మావల ఏఎస్సై అంబాజి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులతో 18 సంవత్సరాల నిండిన తర్వాతనే పెళ్లి చేస్తామని ఒప్పంద పత్రం రాయించారు. బాల్య వివాహాలు చేస్తే వాటి ద్వారా జరిగే అనర్థాలను, పడే శిక్షలు, దుష్పరిణామాలనుతెలియజేశారు.ఐసీడీఎస్ సూపర్ వైజర్‌అనిత, డీసీపీయూ సిబ్బంది అశ్విని, కృష్ణవేణి,మ్యూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ కిల్లరే వినోద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో ప్రాణదాత సీపీఆర్



లఖంపూర్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో, గుండెపోటు వంటి ప్రమాదకర పరిస్థితుల్లో క్షణాల్లో స్పందించి చేసే సీపీఆర్ (సీపీఆర్) ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం పేర్కొన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం వైద్య శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, పోలీస్ సిబ్బందికి సీపీఆర్ విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సద్దాం మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి వైద్య సహాయం అందేలోపు ఛాతిపై ఒత్తిడి చేయడం (సీపీఆర్) ద్వారా గుండె మళ్లీ కొట్టుకునేలా చేయవచ్చని వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గానీ, ఎవరైనా కుప్పకూలినప్పుడు గానీ ఎక్కువగా ఆటో డ్రైవర్లు, పోలీసులు ఘటనా స్థలంలో ఉంటారని, వారికి ఈ మెళకువలు తెలిసి ఉండటం అత్యంత ఆవశ్యకమని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఏ. సంతోష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



మొక్కలు పోయాయి కర్రలు మిగిలాయి



మొక్కల కోసం.. కర్రల ఎదురు చూపులు

ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డులో గల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల ఎదుట మున్సిపల్ అధికారులు గతంలో నాటిన మొక్కల సంరక్షణలో అలసత్వం వహించడంతో ఏపుగా పెరగాల్సిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. మొక్కలు వాలిపోకుండా ఉండేందుకు కర్ర సైతం ఏర్పాటు చేయగా వాటి స్థానంలో కర్రలు మాత్రమే కనిపిస్తుండటం సిబ్బంది నిర్లక్ష్యానికి తార్కాణంగా నిలుస్తుంది. పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో నిధుల దుర్వినియోగం మాత్రమే కాకుండా అసలైన లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో కాలుష్య భూతం పెరుగుతోందన్న భావన స్థానికంగా వ్యక్తమవుతోంది.

– ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పంట కాలం పూర్తి కాకముందే పత్తి తొలగింపు

» రైతులను వెంటాడుతున్న గులాబీ రంగు పురుగు భయం



రైతులు తొలగించిన పత్తి

బోథ్,నవంబరు26 (ఆంధ్రజ్యోతి):ఈయేడాది అధిక వర్షాల వల్ల పత్తి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో రైతులు పత్తి పంట కాలం పూర్తికాకముందే తొలగించివేరే పంటలు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల రైతులు ఇప్పటికే పత్తి పంట తొలగింపు ప్రారంభించారు.

గులాబీ రంగు పురుగు భయం

వర్షాలు అధికంగా ఉండడం వల్ల ఈ ఏడాది పత్తి పంట ఎకరానికి 7,8 క్వింటాళ్ల నుంచి రావడం లేదని రైతులు అంటున్నారు. అయితే నెల రోజుల క్రితం వరకు వర్షాలు కురవడంతో భూమిలో తేమ అధికంగా ఉండడం వల్ల రైతులు పంటలు సాగు చేయాలన్న దృక్పథంతో ఉన్నారు. అయితే మరోవైపు రైతులుఈ సారి నీటి వసతి ఉన్న భూముల్లో పత్తి పంటను తొలగించి జొన్న మొక్కజొన్న పంటలను వేయాలని ఆసక్తి చూపుతున్నారు. నీటి వసతి లేకుంటే శనగ పంట వేయాలని సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మార్కెట్లో జొన్న మొక్కజొన్న శనగ, గోధుమ పంట విత్తనాలు వ్యాపారుల వద్దకు చేరుకున్నాయి. వాటిని రైతులు కొనుగోలు చేస్తున్నారు. మరికొన్ని రోజులు పత్తి పంట ఉంచితే గులాబీ రంగు పురుగు వచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన రైతులు పత్తి పంటను తొలగిస్తున్నారు. పంట దిగుబడి సైతం తగ్గడం జరిగిందని, రబీ పంటతోనే ఎంతో కొంత ఆర్థికంగా బలపడే అవకాశం ఉందని అంటున్నారు.

తగ్గిన పత్తి ధర

బోథ్ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు చేస్తున్న పత్తికి క్వింటాల్‌కు రూ.50 తగ్గించింది.దీంతో రైతులుమూలికే నక్కపై తాటికాయ పడ్డట్టు ఆందోళన చెందుతున్నారు. అసలే నష్టాల్లో ఉన్న రైతులు రూ.50 ధర తగ్గించడంతో ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. కాగా బహిరంగ మార్కెట్లో పత్తి నాణ్యత లేదని గుర్తించిన సీసీఐ అధికారులు రూ.50 తగ్గించి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఏది ఏమైనా ఉగాది పండుగ వరకు సాగయ్యే పత్తి పంట సంక్రాంతి లోపే ముగిసేట్టు ఉంది.

నేటి నుంచి క్లస్టర్ల వారీగా నామినేషన్లు



ఉట్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం

ఉట్నూర్/ఇచ్చోడ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని 38 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికల కోసం క్లస్టర్ల వారీగా నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారిరాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు క్లస్టర్ల వారీగా నియామకమైన ఎన్నికల అధికారులకు ఎన్నికల సామగ్రి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి క్లస్టర్లో నర్సాపూర్ జె, హీరాపూర్ జె, దంతంపల్లి, బీర్సాయిపేట్, గోండుగూడా జి, చెరువుగూడా గ్రామ పంచాయతీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాలన్నారు. అదే విధంగా లక్కారం క్లస్టర్‌లో మత్తడిగూడ, లక్కారం, గంగాపూర్, ఘన్పూర్, దొంగచింత, షాంపూర్ క్లస్టర్‌లో షాంపూర్, నాగపూర్, టక్కుగూడ, లింగోజితండా, లక్షెటిపేట, కామాయిపేట, పులిమడుగు క్లస్టర్‌లో సాలెవాడ కె, పులిమడుగు, వడగల్పూర్ కె, సాకెర బి, చింతకర్ర, సాకెర జె, హస్నాపూర్ క్లస్టర్లో మారుగూడ, హస్నాపూర్, శ్యాంనాయక్‌తండా, చందూరిఉమ్రిక్లస్టర్లో నర్సాపూర్‌బి,ఉమ్రి, నడంగూడా, ఏందా, కుమ్మరితండా, జైత్రంతండా, తాండ్రక్లస్టర్లో బాబాపూర్, తాండ్ర, సాలెవాడ బి, ఉట్నూర్ క్లస్టర్‌లో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్ల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే అవకాశాలు కల్పించామన్నారు.ఆయాక్లస్టర్లలో ఉదయం10.30గంటల నుంచి సా యంత్రం ఐదుగంటల వరకు మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.

నామినేషన్లకు చివరి తేదీ 29

ఇచ్చోడలోసర్పంచ్,వార్డుసభ్యుల ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు పంచాంగంపై కాసింత పట్టున్న పండితల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. నామినేషన్ దాఖలుకు మంచిరోజు కోసం ఆరా తీస్తున్నారు. నేటి నుంచి మొ దటి విడత పంచాయతీ ఎన్నికలకు 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీక రణకు గడువు ముగించారు.

33 గ్రామపంచాయతీలకు 8 క్లస్టర్లు

ఇచ్చోడ మండలంలో మొత్తం 33 గ్రామపంచాయితీలకు గానూ 8 క్లస్టర్లను ఏర్పాటుచేసి ఆ క్లస్టర్ల పరిధిలో ఉన్న గ్రామపంచాయతీల నామినేషన్లను స్వీకరిస్తారు.బోరిగామ క్లస్టర్ పరిధిలో బోరిగామ,జున్నికామగిరి, ఇచ్చోడ క్లస్టర్ పరిధిలో ఇచ్చోడ, దుబార్‌పేట్, అడేగామ(కె),అడేగామ(బి), గేర్జం క్లస్టర్ పరిధిలో గేర్జం, జల్దా, జామిడి, చించోలి, దరంపూరి, కోకస్‌మన్నూర్ క్లస్టర్‌లో కోకస్ మన్నూర్, దేవుల్‌నాయక్‌తాండ,సాత్‌నంబర్,ముక్రా(కె),ముక్రా(బి),మాన్కా పూర్ క్లస్టర్ పరిధిలో మాన్కాపూర్,నర్సాపూర్, గుండివాగు, కేశవపట్నం, సిరి చెల్మక్లస్టర్ పరిధిలోసిరిచెల్మ గుండాల,బాబ్జీపేట్, ఎల్లమ్మగూడ, తలమద్రి క్లస్టర్ పరిధిలో తలమద్రి, మదాపూర్, మల్యాల,సల్యాద,నవేగాం,దాబా(కె)క్లస్టర్ పరిధిలో దాబా(బి),దాబా(కె),హిరాపూర్‌అభ్యర్థులు నామినేషన్లను దాఖాలు చేయవచ్చు.

పంచాయతీ రిజర్వేషన్లు బీసీలకు అన్యాయం

నేరడిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రిజర్వేషన్లలో నేడుగొండ మండలానికి తీవ్ర అన్యాయం జరిగిందని నాయి బ్రాహ్మణ నాయకులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో గల 32 స్థానాలకు గాను ఎస్టీలకు 18 ఎస్సీలకు 2, జనరల్ 12 స్థానాలు కేటాయించగా బీసీలకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకుండా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసి సంఘాల నాయకులు. మాదాసు ప్రవీణ్. సింగారపు రమేష్. చిలకాడి పురుషోత్తం. డి నవీన్. ఓ. రాజన్న. ఏ అనిల్. తదితరులు ఉన్నారు.

తేజాపూర్ సర్పంచ్ ఏకగ్రీవానికి గ్రామస్థుల తీర్మానం



కోవా రాజేశ్వర్

ఇంద్రవెల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం చేయడానికి గ్రామస్థులు తీర్మానించారు.బుధవారం మండలం లోని సాలేగూడ గ్రామంలో గ్రామపటేల్ మడావి చిత్రు ఆధ్వర్యంలో తేజాపూర్ జీపీ పరిధి లోని తేజాపూర్, సాలేగూడ, దొబ్బిగూడ,మోహన్‌గూడ గ్రామాల్లో గ్రామ పటేళ్ల సమావేశమయ్యారు. తేజాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కోవా రాజేశ్వర్‌తో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులను ఏకగ్రీ వంగా ఎన్నుకు న్నారు. కాగా తేజాపూర్ పంచాయతీ ఎన్నిక మొదటి దశలో డిసెంబరు 11న జరగనుంది.


ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ లక్ష్యం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై పోలీసు వ్యవస్థ 24 గంటలు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం స్థానిక మావల పోలీస్ స్టేషన్ లో ప్రజలు వేచి ఉండే ప్రదేశం, ముగ్గురు ఎస్సైలకు ప్రత్యేక గదిని జిల్లా ఎస్పీ వేద మంత్రోచ్చారణల నడుమ ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు మధు కృష్ణ, యూనుస్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కుర్చీల పంపిణీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆస్పత్రికి వచ్చే వారి సౌలభ్యం కోసం జిల్లా మాల సంక్షేమ సంఘం తరఫున పది కుర్చీలను అందించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌కు సంఘం నేతలు కుర్చీలను అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, అశోక్, దేవన్న, రాఘవేంద్ర, స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.9, కనిష్ఠం 17.4
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 27 నవంబరు 2025





రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది




మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాధిక

రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

» జిల్లా న్యాయాధికారి రాధిక

ముథోల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అని ప్రతి భారతీయుడు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవ జిల్లా కార్యదర్శి జిల్లా న్యాయాధికారి జి.రాధిక అన్నారు. అఖిల భారత ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సరైన పరిపాలన కోసం రాజ్యాంగ ఆవశ్యకతను గుర్తించి ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్. అంబేద్కర్ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు నిరంతరం శ్రమించి భారత రాజ్యాంగాన్ని రచించగా 26 నవంబరు 1949న ఆమోదించుకోవడం జరిగిందన్నారు. ఈ దినాన్ని రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని వివరించారు. రాజ్యాంగంలో ప్రతీ పౌరుడికి ప్రాథమిక హక్కులతో పాటు విధులను కూడా కల్పించారని వాటి పట్ల ప్రతీ వ్యక్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమర్థవంతమైన మన రాజ్యాంగం ద్వారానే మన దేశం ఈనాడు సుస్థిరంగా ఉండి అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. రాజ్యాంగంలోని సెక్షన్లను తెలుసు కున్నట్లయితే మనకు జరిగినటువంటి అన్యాయాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, సరైన న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అడ్వైజర్స్ రాజలింగం లింగా గౌడ్, జిల్లా ఆస్పత్రిలో పర్యవేక్షణ అధికారి డాక్టర్ సురేష్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా అధ్యక్షుడు డి. రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామెర్ల రాజన్న, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వి.ప్రభాకర్, సంఘ సభ్యులు డి.రాజేశ్వర్, తాళ్ల చిన్నయ్య, ఏ.రాజేశ్వర్, వసంత్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలపై నజర్

» బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసు శాఖ
» 27 ప్రదేశాల వద్ద జాగ్రత్త చర్యలు
» డిఫెన్స్ డ్రైవింగ్ పేరిట ప్రమాదాలకు అడ్డుకట్ట
» ఇక జిల్లాలో పక్కాగా అమలుకు కార్యచరణ

నిర్మల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టబోతోంది. రోడ్డు ప్రమాదాల కారణంగా చాలా మంది ప్రాణాలు కొల్పోతుండడమే కాకుండా తీవ్ర గాయాల పాలై అంగ వైకల్యానికి గురవుతున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు సైతం వీధిన పడుతున్నాయి. ప్రతీ నెల 15 మందికి తగ్గకుండా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండగా దాదాపు 50 మందికి పైగా ప్రతీ నెల రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలవుతున్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలపై నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వారం రోజుల క్రితం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలతో పాటు ప్రమాదాలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. అలాగే ప్రమాదాల నివారణ కోసం చేపట్టే చర్యలపై సైతం మార్గదర్శకాలను జారీ చేశారు. అతివేగంగా డ్రైవింగ్ చేయడం అలాగే మద్యం తాగి డ్రైవింగ్ చేయడంతో పాటు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, మూల మలుపుల వద్ద అజాగ్రత్తగా వాహనాలను నడపడం లాంటివి రోడ్డు ప్రమాదాల కారణమవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే పోలీసులు తరచుగా వాహనాల తనిఖీలను చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నప్పటికి పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. కోర్టుల్లో శిక్షలు పడుతున్న విషయంపై కూడా పోలీసులు ప్రచారం చేస్తున్న గానీ మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడం లాంటి వ్యవహారాలు సద్దుమణగడం లేదు. ప్రతిరోజూ జిల్లా అంతటా నాలుగైదుకు తక్కువ కాకుండా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకోసం రవాణా, పోలీసు శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నప్పటికి ఆ ప్రచారానికి స్పందన కనిపించడం లేదు. దీంతో పోలీసు శాఖ ఇక సీరియస్‌గా రంగంలోకి దిగి డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో పాటు మరికొన్ని పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది.

ఇప్పటికే 140 మందికి పైగా మృతి

జిల్లాలో పది రోజుల నుంచి మొత్తం 522 రోడ్డు ప్రమాదాలు జరగగా ఈ ప్రమాదాల్లో 140 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ లెక్కన ప్రతీ నెల 14 మందికి తగ్గకుండా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. కాగా ఇప్పటివరకు 612 మంది గాయాలపాలయ్యారు. ఇదిలా ఉండగా పోలీసులు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చేస్తున్న కసరత్తులో భాగంగానే జిల్లా అంతటా 27 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. ఈ 27 బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలు ప్రమాదాలకు నెలవుగా ఉన్నట్లు నిర్ధారించారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్ పేరిట ప్రత్యేక కార్యాచరణ

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సరికొత్త యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. ఇందులో భాగంగానే డిఫెన్సివ్ డ్రైవింగ్ పేరిట ఓ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ డిఫెన్స్ డ్రైవింగ్ కోసం పోలీసులు ఊరూరా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టనున్నారు. దీనికోసం గానూ ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. రోడ్డుపై అప్రమత్తంగా ఉండడం, పరిసరాలను ఎప్పటికప్పుడు గమనించడం, ఇతరుల తప్పిదాలను ముందుగానే అంచనా వేయడం లాంటి టెక్నిక్‌లు ఈ డిఫెన్సివ్ డ్రైవింగ్‌లో కీలక అంశాలుగా నిర్ధారించారు. తప్పుదారిలో వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేసే వారికి దూరంగా ఉండడం, రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరుచుకునే అవకాశం ఉండడంతో వాటి పట్ల జాగ్రత్తలు తీసుకోవడం లాంటి అంశాలపై డిఫెన్సివ్ డ్రైవింగ్‌లో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించనున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజా సేవ చేయాలి

» జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని అధికారులకు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడి హక్కులను కాపాడే మహత్తర పత్రంగా నిలిచిం దన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగం మార్గదర్శకమని పేర్కొన్నారు. పౌరులందరూ రాజ్యాంగంలో ప్రతిపాదించిన మౌలిక హక్కులు, కర్తవ్యాలు తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రజా సేవలో ఉన్న ప్రతీ ఉద్యోగి రాజ్యాంగ విలువలను పాటిస్తూ పారదర్శకత, నిబద్ధతతో పనిచేస్తేనే మంచి పాలన సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా నిర్మించేందుకు ప్రతీ పౌరుడు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లు వేగవంతం

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పరిపాలన తీసుకున్న ఏర్పాట్లు, అనుసరించాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతం, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3 దశలలో ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, పోలింగ్ సామాగ్రి పంపిణీ వంటి ప్రతీ అంశాన్ని మండలాల వారీగా సమీక్షిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సూచనలు అందించినట్లు వెల్లడించిన కలెక్టర్, ఎన్నికల సంబంధిత ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖతో సమ న్వయం పెంచి తగిన భద్రతా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించడంలో ఎలాంటి రాజీ ఉండదని, ఉల్లంఘనలు గమనించిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలు



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణ

దస్తురాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా అరుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన అరుణను అధికారులు, సిబ్బంది అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం తో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానన్నారు.

కడెం ఎంపీడీవోగా..



బాధ్యతలు స్వీకరిస్తున్న సునీతను సన్మానిస్తున్న సిబ్బంది

కడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కడెం ఎంపీడీవో జి.సునీత పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కడెం ఎంపీడీవోగా కొనసాగిన బి.అరుణ సస్పెన్షన్‌కు గురికావడంతో ఆమె స్థానంలో దస్తురాబాద్ ఎంపీవోగా ఉన్న రమేష్ రెడ్డికి కడెం ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. కాగా బుధవారం దస్తురాబాద్ ఎంపీడీవోగా కొనసాగుతున్న జే.సునీతకు డిప్యూటేషన్‌పై కడెం ఎంపీడీవోగా నియమితులయ్యారు. దీంతో కడెం ఎంపీడీవోగా జే.సునీత పదవీ బాధ్యతలు స్వీకరించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న మునిసిపల్ అధికారులు

రోడ్డు ఆక్రమణల తొలగింపు

భైంసా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలను బుధవారం మునిసిపల్ అధికారులు తొలగింపచేశారు. ఉదయం వేళలో మున్సిపల్ టీపీవో అనురాధ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణల తొలగింపుల ప్రక్రియ కోసం గాను స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా మునిసిపల్ కార్యాలయ రోడ్డు నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయ రోడ్డు వరకు గల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు గాను ఆక్రమణల తొలగింపులు చేపట్టినట్లుగా టీపీవో అనురాధ వెల్లడించారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులు పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో చేపడుతామని స్పష్టం చేశారు. ఆక్రమణ దారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకొని మున్సిపల్ అధికారులకు సహకరించాలని సూచించారు.

సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ



సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై రాస్తారోకో చేసినట్లు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పార్లమెంట్‌లో చట్టం చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ 10,000లకు తగ్గకుండా ఇవ్వాలని వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని, ఉపాధి హామీ బడ్జెట్‌లో నిధులు పెంచాలని, పట్టణాల్లో సైతం ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాజన్న, నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, పి. గంగామణి, బానోత్ సుజాత, తిరుపతి, శ్రీనివాస్, రాజేష్, లింగన్న, బక్కన్న, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



కల్లూరు దత్త వెంకట సాయి ఆలయంలో దత్తజయంతి ఉత్సవాలు

కుంటాల, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు దత్త వెంకట సాయి మందిరంలో బుధవారం రోజు దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు వచ్చే నెల 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం గోపూజ విగ్నేశ్వర పూజ, దత్త వెంకటసాయి దేవతల పూర్ణాభిషేక పూజలు, కళశ స్థాపన, దత్త గురుచరిత్ర సాయిబాబా సచ్చరిత్ర గజానన్ విజయం, పారా యణములు, ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ సాయినామ సప్తాహ సంకీర్తన ప్రారంభం. 4వ తేదీ గురువారం వరకు అఖండ సాయినామ సప్తాహం సంకీర్తన పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించండి

» పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

నిర్మల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో భాజపా ఏకపక్షంగా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని విద్యార్థులంతా వ్యతిరేకించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ. శ్రీకాంత్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం టీఎన్జీవో హోంలో పీడీఎస్‌యూ జిల్లా 20వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభకు ముఖ్య అతిథులుగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోదీ హయాంలో దేశ విద్య పూర్తిగా విధ్వంసం అయిపోతుందని ఆరోపించారు. విద్య ప్రమాణాలు, నాణ్యత కూడా లోపిస్తున్నాయని ఇది నష్టదాయకమైన చర్య అన్నారు. సమాజ అభివృద్ధికి విద్య ఎంతగానో తోడ్పడుతుందని అలాంటి విద్యను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో విద్యకు అతితక్కువ నిధులను కేటాయిస్తున్నారని మరోవైపు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను విపరీతంగా ప్రోత్సహించే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే డిసెంబరు 10, 11, 12 తేదీల్లో వరంగల్ జిల్లాలో సంస్థ 20వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు దీనికి విద్యార్థులంతా కదిలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి ఆదిలాబాద్ పూర్వ జిల్లా అధ్యక్షుడు జగజంపుల రాజు, ప్రగతిశీల మహిళా సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు హరిత, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేష్, జిల్లా నాయకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడికి బీజేఎల్పీ నేత పరామర్శ



నిమ్స్‌లో రవీందర్‌ను పరామర్శిస్తున్న బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న నిర్మల్ జిల్లా సీనియర్ పాత్రికేయుడు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రవీందర్‌ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కాగా రవీందర్ మోకాలి శస్త్ర చికిత్స నిమిత్తం 1.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్వోసీని లేటి మహేశ్వర్ రెడ్డి మంజూరు చేయించారు.

క్లస్టర్ల వారీగా నామినేషన్లు స్వీకరించాలి

» పంచాయతీ ఎన్నికలపై అధికారులకు ఎంపీడీవో దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ సుజాత

ఖానాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల నుంచి క్లస్టర్ల వారీగా నామినేషన్లను స్వీకరించాలని ఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ సుజాతలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేవంలో ఆర్వో, ఏఆర్వోలకు ఎన్నికల విధులపై వారు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారి వారికి కేటాయించిన క్లస్టర్లలో ఆర్వో, ఏఆర్వో, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఖానాపూర్ మండలంలో 7 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బీర్నంది క్లస్టర్ పరిధిలో బీర్నంది, కొలంగూడ, ఎర్వచింతల్, రంగాపేట్ గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు, మస్కాపూర్ క్లస్టర్ పరిధిలో మస్కాపూర్, బాధనకుర్తి గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు, సుర్జాపూర్ క్లస్టర్ పరిధిలో సుర్జాపూర్, మేడంపల్లి, ఎక్బాల్‌పూర్ గ్రామాలకు సంబంధించి నామినేషన్లు, పాత ఎల్లాపూర్ క్లస్టర్ పరిధిలో పాత ఎల్లాపూర్, కొత్తపేట్, గోడలపంపు గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు, గోసంపల్లె క్లస్టర్ పరిధిలో గోసంపల్లె, దిలావర్‌పూర్, బావాపూర్(కే) గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు, సత్తెనపెల్లి క్లస్టర్ పరిధిలో సత్తెనపెల్లి, తర్లపాడ్, పాత తర్లపాడ్, సేవ్యానాయక్ తండా, అడవి సారంగాపూర్ గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు, రాజురా క్లస్టర్ పరిధిలో రాజురా, సింగాపూర్, హరిచందర్ తండా, దాస్య నాయక్ తండా, బావాపూర్(ఆర్) గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలో నిలిచే అభ్యర్థులు సంబంధిత క్లస్టర్లలో నామినేషన్ దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, ఆర్వో, ఏఆర్వో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో పీఎం శ్రీ క్రీడలు



బహుమతులు అందజేస్తున్న డీటీడీవో జాదవ్ అంబాజీ

నిర్మల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, జిల్లా విద్యాధికారి భోజన్న పీఎం శ్రీ ఇన్‌చార్జి లింబాద్రి ఆదేశానుసారం ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలుర డ్యాంగాపూర్ నందు పలు విభాగాలలో ఆటల పోటీలను నిర్వమించి గెలుపొందిన జట్లకు డీటీడీవో జాదవ్ అంబాజీచే బహుమతులను అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ తెలిపారు. తదుపరి ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్ జట్లను ఎంపిక చేశారు.

పంచాయతీ ఎన్నికలకు

ఏర్పాట్లు పూర్తి చేయాలి

» రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్ల పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్మల్ కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు. రేపటి నుంచి మొదటి విడత నామినేషన్లు ప్రారంభం కానుండగా, ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా జరిగేలా కఠినమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా ఎట్టి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకుని భద్రతా బందోబస్తు పటిష్ఠంగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఎలాంటి రాజీ ఉండబోదని, ఉల్లంఘనలకు వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీతో సహా అన్ని పోలింగ్ సామాగ్రిని ఇప్పటికే సంబంధిత మండలాలకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజీవ్ మీనా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.